ఉజ్వల భవిష్యత్తుకు బాటలు

ప్రజాశక్తి- కడప అర్బన్

విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకునేలా కృషి చేయాలని యాంటి హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ సిఐ ఈదురు బాషా పేర్కొన్నారు. ఎస్పి ఆదేశాల మేరకు బుధవారం నగరంలోని నిర్మల నర్సింగ్ స్కూల్ విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే సమాజం పట్ల బాధ్యతాయుతంగా ఉంటూ మంచి పౌరులుగా ఎదగాలని సూచించారు. బాగా చదువుకుని సమాజానికి, దేశానికి సేవ చేయాలని సూచించారు. తల్లిదండ్రుల ఆశల్ని, ఆశయాలను నెరవేర్చేలా మీ వంతు కృషి చేసి విజయం సాధించాలని ఆకాంక్షించారు. అవగాహన కార్యక్రమంలో పోక్సో యాక్టు, పిల్లల భద్రత, బాల్య వివాహాలు, ఈవ్ టీజింగ్, డయల్ - 100, రహదారి భద్రత, సోషల్ మీడియా, సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. కార్యక్రమంలో నర్సింగ్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

'పది' పరీక్షల నిర్వహణకు పటిష్ట చర్యలు

- కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

పి-4 పోస్టర్లను ఆవిష్కస్తున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, జెసి అదితి సింగ్

ప్రజాశక్తి - కడప అర్బన్

ఈ నెల 17 నుంచి 31 వరకు నిర్వహించబోయే పదవ తరగతి పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టినట్టు కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. బుధవారం అమరావతి నుంచి పదవ తరగతి పరీక్షల సన్నద్ధత, కలెక్టర్ కాన్ఫరెన్స్, స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర అంశాలపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చీఫ్ సెక్రెటరీ కావేటి విజయానంద్ కలెక్టర్లు, జిల్లా పోలీస్ అధికారులు, విద్యా శాఖాధికారులు, సంబంధిత అధికారులతో వర్చువల్ విధానంలో సమీక్షించారు. ఈ సందర్భంగా విసి ద్వారా రాష్ట్ర చీఫ్ సెక్రెటరీ కావేటి విజయానంద్ మాట్లాడుతూ పదవ పరీక్షలకు సంబంధించి సుమారు రాష్ట్ర వ్యాప్తంగా 6,19,275 మంది విద్యార్థులు హాజరవుతున్నారని తెలిపారు. మొత్తం 3,450 పరీక్ష కేంద్రాలలో నిర్వహించే ఈ పరీక్షా కేంద్రాలలోనికి ఉన్నతాధికారులతో సహా ఏ ఉద్యోగి కూడా సెల్ ఫోన్ లను తీసుకెళ్లడం నిషేదించినట్టు స్పష్టం చేశారు. పరీక్షా ప్రశ్నా పత్రాలను స్ట్రాంగ్ రూమ్‌లకు తీసుకెళ్లేటప్పుడు పటిష్టమైన బందోబస్తు ఉండాలని పేర్కొన్నారు. పరీక్షా పేపర్ల తరలింపుపై జిల్లా స్థాయిలో సంబంధిత పోలీస్ సూపరింటెండెంట్‌లు, పోస్టల్ డిపార్ట్‌మెంట్ అధికారులు, ఇతర సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించాలని సూచించారు. పరీక్ష కేంద్రాలలో ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కార్యకలాపాలకు తావు లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. పరీక్షా కేంద్రాలకు హాజరయ్యే విద్యార్థులకు ఆర్‌టిసి బస్సులు అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. పదవ పరీక్షల కోసం రాష్ట్ర స్థాయిలో 0866-297454 నంబర్‌తో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని తెలిపారు. సిఎస్ విసి ముగిసిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పదవ పరీక్షలను ఎటువంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. సమస్యాత్మక పరీక్ష కేంద్రాలలో సిసి కెమెరాలు ఏర్పాటుతో పాటు, ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల పరిధిలో ఇంటర్‌నెట్, జెరాక్స్ సెంటర్‌లను మూసి వేయించాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల్లోకి అభ్యర్థులు, ఇన్విజిలేటర్లు,ఇతర ఉన్నతాధికారులతో సహా ఏ ఇతర సిబ్బంది ఎలక్ట్రానిక్ పరికరాలు,మొబైల్ ఫోన్లు తీసుకువెళ్లరాదన్నారు. పోలీసులు ముందుగా తనిఖీ చేయాలని ఆదేశించారు. ఎక్కడా మాస్ కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా చూడాలన్నారు. పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులు సకాలంలో చేరాలన్నారు. పరీక్ష కేంద్రాలలో తాగునీరు, మరుగుదొడ్లు, లైట్లు, ఫ్యాన్‌లు ఉండేలా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ రకాల పథకాలపై ప్రజా అభిప్రాయాలను చేపట్టాలన్నారు. అనంతరం కలెక్టర్, జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, ఇతర జిల్లా అధికారులతో కలిసి పి-4 పోస్టల్ విడుదల చేశారు. కార్యక్రమంలో సిపిఒ అజరతయ్య, జిల్లా పంచాయతీరాజ్ అధికారి రాజ్యలక్ష్మి, డిఇఒ షంషుద్దీన్, జడ్‌పి సిఇఒ ఓబులమ్మ, డిఆర్‌డిఎ పీడీ ఆనంద్ నాయక్, మెప్మా పీడీ కిరణ్ కుమార్, అధికారులు పోలీసు, ట్రాన్స్‌పోర్టు అధికారులు పాల్గొన్నారు.

పశువైద్య విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

- మాజీ ఎమ్మెల్సీ గేయానంద్

విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న గేయానంద్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు పుట్టపర్తి సర్కిల్

పశు వైద్య విద్యార్థులు అడుతున్నది న్యాయమైన కోర్కెలని, అవి గొంతెమ్మ కోరికలు కాదని ప్రభుత్వం ఆలోచించాలని జెవివి రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ కోరారు. బుధవారం స్థానిక గోపవరం పంచాయతీలోని పశువైద్య కళాశాలలో రిలే నిరాహార దీక్షలు చేస్తున్న జూనియర్ డాక్టర్స్‌ను కలిసి వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక సాధారణ ఉద్యోగి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలనేది ప్రభుత్వ జీవో ఉందన్నారు. న్యాయమైన విషయం అడిగిన వారికి ఒక శక్తి ఉంటుందన్నారు. నిరసన ఇలాగే కొనసాగించాలన్నారు ప్రభుత్వం నుంచి బెదిరింపులు వచ్చినా తలొగ్గకుండా పోరాటం కొనసాగించాలని పిలుపు నిచ్చారు. అలసిపోకుండా పోరాటం చేస్తే సాధించలేనిది ఏమీ లేదన్నారు. 38 రోజులుగా దీక్షలు చేస్తున్న పట్టించుకోని ప్రభుత్వం రైతులను, ప్రజాసంఘాలను, విద్యార్థి సంఘాలను, కుల సంఘాలను కలుపుకొని పోరాటం ఉధృతం చేయాలన్నారు. పోరాటం ప్రజలకు కూడా తెలిసే విధంగా రోడ్డుమీదికొచ్చి పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. పశు వైద్య విద్యార్థుల స్టైఫండ్ విషయంలో ఫైనాన్స్ మినిస్టర్ పయ్యావుల కేశవ్‌తో మాట్లాడతానని విద్యార్థులకు ఆయన హామీ ఇచ్చారు. అనంతరం జెవివి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ తవ్వా సురేష్ మాట్లాడుతూ పశు వైద్య విద్యార్థుల స్టైఫండ్ విషయంలో ప్రభుత్వం రూ. 7 వేల నుంచి రూ. 10,500 పెంచే ఆలోచనలో ఉందని ప్రభుత్వ భ్రమలో పడొద్దన్నారు. ఎంబిబిఎస్ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులతో సమానంగా స్టైఫండ్ ఇచ్చేంత వరకు నిరసన కార్యక్రమాలు కొనసాగించాలన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రవి మాట్లాడుతూ జిల్లాలో ఐదుగురు ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ ఉన్న పశువైద్య విద్యార్థుల విషయంలో మాట్లాడే నాయకుడే లేరన్నారు. రాజకీయ నాయకులు కేవలం ఓట్ల కోసమే రాజకీయం చేస్తున్నారని, ప్రజల కోసం, విద్యార్థుల కోసం, వారి సమస్యల కోసం మాట్లాడే నాయకుడే లేరని వాపోయారు. పశు వైద్య విద్యార్థుల కోసం మార్చి 15న ధర్నా చౌక్‌లో ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో జెవివి రాష్ట్ర సమత నాయకులు డాక్టర్ ప్రసన్న, సిపిఎం పట్టణ అధ్యక్షులు కె. సత్యనారాయణ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాహుల్, డి వైఎఫ్ ఐ పట్టణ కార్యదర్శి విశ్వనాథ్ , అప్కాస్ పశు వైద్య కళాశాల అధ్యక్షులు సుబ్బారావు, ఉపాధ్యక్షుడు సుబ్బయ్య పశు వైద్య కళాశాల జూనియర్ డాక్టర్స్ పాల్గొన్నారు.

రావులపల్లి సర్పంచ్ చెక్‌పవర్ రద్దు

- రూ.11,59 లక్షలు దుర్వినియోగం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి/ఖాజీపేట

జిల్లాలోని మైదుకూరు నియోజకవర్గం ఖాజీపేట మండల పరిధిలోని రావులపల్లి పంచాయతీ సర్పంచ్ పి.శివరామిరెడ్డి చెక్‌పవర్‌ను జిల్లా పంచాయతీ అధికారి రద్దు చేశారు. 2022 నుంచి 2025 వరకు పంచాయతీకి చెందిన సాధారణ, 15వ ఫైనాన్స్ నిధుల దుర్వినియోగంపై వచ్చిన ఫిర్యాదులపై కడప డివిజనల్ పంచాయతీ అధికారి అందించిన విచారణ నివేదిక మేరకు చర్యలు తీసుకున్నారు. 2022-23 సంవత్సరానికి సంబంధించిన తాగునీటి సరఫరా నిమిత్తం రూ.2,73,815 నిధుల వినియోగాన్ని ఎంబుక్‌లో రికార్డు చేసినప్పటికీ ఖర్చు పద్దుల వివరాలను నమోదు చేయలేదని గుర్తించారు. 2023-24 సంవత్సరానికి సంబంధించిన నీటిసరఫరాకు రూ.4,20,127, క్లాప్‌మిత్ర వేతనాలు రూ.42,000, పారిశుధ్య పనులకు రూ.46,682 వెరసి మొత్తం 5,30,809 ఖర్చు చేసిన వివరాలు లేక పోవడాన్ని నివేదికలో ప్రస్తావన చేశారు. ఇదేతరహాలో 2024-25 డిసెంబర్ వరకు నీటి సరఫరా నిమిత్తం రూ.2,12,713, సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు రూ.1,42,372 వెరసి మొత్తం 3,55,085 ఖర్చు చేసిన వివరాలను ఎంబుక్‌లో నమోదు చేయకపోవడం గమనార్హం.

బ్లడ్ బ్యాంకులు ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు జిల్లా లెప్రసి, ఎయిడ్స్ అండ్ టిబి విభాగ అధికారి డాక్టర్ రవి బాబు సంయుక్తంగా కడప నగరములో ఉన్న రేడ్ క్రాస్ బ్లడ్ సెంటర్ , బృహదా బ్లడ్ సెంటర్, భోగా పార్వతమ్మ బ్లడ్ సెంటర్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. రిజిస్టర్లను పరిశీలించారు. రోగుల నుంచి ఎంత మొత్తం తీసుకుంటున్నారని ఆరా తీశారు. రిక్విజేషన్ ఫామ్ ఉచితంగా తీసుకున్న వారికి ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకోన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం మేనేజర్ ఎల్. అలీ హైదర్, ఎస్. ఖాజా పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వమే చెల్లించాలి

ప్రజాశక్తి - కడప

ర్యాలీ నిర్వహిస్తున్న వైసిపి నాయకులు

ఫీజుల రీయింబర్స్ మెంట్‌ను ప్రభుత్వమే చెల్లించాలని వైసిపి నాయకులు డిమాండ్ చేశారు. వైసిపి రాష్ట్ర అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు బుధవారం కడప నగరంలో వైసిపి జిల్లా అధ్యక్షులు పి. రవీంద్రనాథ్ రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, నగర మేయర్ సురేష్ బాబు ఆధ్వర్యంలో యువత పోరు నిర్వహించారు. వైసిపి కడప జిల్లా కార్యాలయం నుంచి నగరంలోని ప్రధాన కూడళ్ల మీదుగా కలెక్టరేట్ వద్దకు చేరుకుంది. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినదించారు. అనంతరం డిఆర్ఒ విశ్వేశ్వర నాయుడుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం మీడియాతో వైసిపి నాయకులు మాట్లాడారు.10 నెలల్లోనే కూటమి ప్రభుత్వంపై ఏర్పడిన వ్యతిరేకతకు సాక్ష్యంగా యువత పోరు నిలిచిందన్నారు. చంద్రబాబు నాయుడు పని ఇక అయిపోయిందని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా కూటమి ప్రభుత్వం మోసాలు అధికమయ్యాయి అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా వైఎ.స్ రాజశేఖర్ రెడ్డి విద్యార్థులకు మంచి భవిష్యత్తును ఇచ్చారు అన్నారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 90 శాతం మందికి ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్య దీవెన, వసతి దీవెన అందించారు అని తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ రెడ్డి, ఎమ్మెల్సీలు డి.సి గోవింద్ రెడ్డి, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రఘురాం రెడ్డి, రాచమల్లు శివప్రసాద్ రెడ్డి, సుధీర్ రెడ్డి, కమలాపురం ఇన్‌ఛార్జి నరేన్ రామాంజనేయరెడ్డి, జిల్లా యువజన విభాగ అధ్యక్షుడు దేవి రెడ్డి ఆదిత్య, జిల్లా విద్యార్థి విభాగమ అధ్యక్షుడు గురు సాయి దత్త, నగర యువజన విభాగం అధ్యక్షుడు గుంటి నాగేంద్ర, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

సత్యం వైపు సమాజాన్ని నడిపించడమే ధ్యేయం

ప్రజాశక్తి - కడప : సమాజాన్ని సత్యం వైపు నడిపించడమే మా ధ్యేయమని తిరుపతికి చెందిన దైవజనులు కె.కె సుధీర్ అన్నారు. కడప నగరం ప్రకాష్ నగర్ లో గల ప్రార్థన మందిరంలో పాస్టర్ పాలగిరి జాన్సన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరై మాట్లాడారు. హాజరైయ్యారు. ఈ సందర్భంగా కె.కె సుధీర్ మాట్లాడుతూ ప్రజలందరూ మూఢనమ్మకాలపై మొగ్గుచూపకుండా, అజ్ఞానాన్ని అనుసరించక, సత్యాన్ని స్వీకరించి ఐకమత్యంతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో పాస్టర్ పి.మహేష్, ప్రముఖ సేవకులు వి.కిరణ్, పి.రవితేజ, జె.లక్ష్మి నారాయణ, పి.దానియేలు, యం.జ్ఞానేంద్ర, రాజ్ కుమార్, ఏ.అగస్టిన్ పాల్గొన్నారు.

ఐఐటిలో 'దీప్తి' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - బద్వేలు

గుంటూరు భాష్యం ఐఐటి క్యాంపస్ వారి ఆధ్వర్యంలో జిల్లాస్థాయిలో ఫీజు రాయితీ పోటీ పరీక్ష నిర్వహించారని, అందులో దీప్తి కోచింగ్ సెంటర్ నుండి 8 మంది విద్యార్థులు గుంటూరు రామసేతు ఐఐటి క్యాంపస్‌కు ఎంపికయ్యారని కోచింగ్ సెంటర్ ప్రిన్సిపల్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఆరుగు విద్యార్థులకు వందశాతం ఫీజు రాయితీ, ఇద్దరికి 75 శాతం రాయితీ లభించిందన్నారు. ఉచిత ఫీజు రాయితీకి ఎంపికైన విద్యార్థులను అభినందించారు. భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

ఉద్యోగాలు ఇచ్చే స్థాయిలో నిలవాలి

- వైవీయూ వ్యవస్థాపక దినోత్సవంలో మెజిస్ట్రేట్ పసుపులేటి శంకర్

ప్రజాశక్తి - కడప అర్బన్ : విద్య పరిశోధన ప్రమాణాలకు నెలవైన యోగి వేమన విశ్వవిద్యాలయంలో చదివిన విద్యార్థులు ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలని రాజంపేట స్పెషల్ జ్యూడిషల్ మేజిస్ట్రేట్, డాక్టర్ పసుపులేటి శంకర్ ఆకాంక్షించారు. యోగి వేమన విశ్వవిద్యాలయం 19వ వ్యవస్థాపక దినోత్సవం, కళాశాల ఉత్సవం డాక్టర్ ఏపిజె అబ్దుల్ కలాం కేంద్ర గ్రంథాలయ ప్రాంగణంలో బుధవారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రాజంపేట స్పెషల్ జ్యూడిషల్ మేజిస్ట్రేట్ మాట్లాడుతూ సాధించాలనే తపన, సంకల్పబలం ఉన్నవారే విజేతల జాబితాలో నిలుస్తారన్నారు. ప్రతి విద్యార్థి ఓ లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాని సాధన కోసం నిరంతరం శ్రమించాలన్నారు. చరిత్రలో ఎజీ ఉండేలా ప్రణాళికలు ఉండాలన్నారు. ఆకాశంలో ఎగిరే గాలి పటం మీరైతే దానికి ఉన్న దారం తల్లిదండ్రులని, దిశా నిర్దేశం చేస్తూ కాపాడుకుంటూ ఉంటారనే విషయాన్ని నిత్యం గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు. బిడ్డల కోసం నిద్రలేని రాత్రులు గడిపిన అమ్మ నాన్నలను మరిచిపోవద్దని హితబోధ చేశారు. ప్రిన్సిపల్ ఆచార్య యస్. రఘునాథ రెడ్డి ప్రారంభ సభకు అధ్యక్షత వహించి మాట్లాడారు. విశ్వ విద్యాలయాల వార్షిక నివేదికను నివేదించారు. విద్య పరిశోధనలో విశ్వవిద్యాలయంలో అద్వితీయమైన ప్రగతిని సాధించిందన్నారు. విద్యాలయ అధ్యాపకులు అంతర్జాతీయ స్థాయిలో పరిశోధనలు, ప్రాజెక్టులు, పేటెంట్లు తెచ్చారన్నారు. ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ఆచార్య పి. పద్మ మాట్లాడుతూ విశ్వవిద్యాలయం ఈ ఏడాదిలో 56 మంది స్కాలర్లకు పిహెచ్‌డి అవార్డులు ఇచ్చామని తెలిపారు. పరిశోధన సమన్వయం , విద్యార్థుల అవకాశాలు కల్పించడంలో భాగంగా 8 ప్రముఖ సంస్థలతో ఎంఒయు కుదుర్చుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో వివిధ కమిటీల కన్వీనర్లు, సభ్యులు, విద్యార్థులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

జ్యోతి క్షేత్రంలో కూల్చివేతలు ఉండవు

ప్రజాశక్తి-కాశినాయన

జ్యోతి క్షేత్రంలో పర్యటిస్తున్న కె.కె.చౌదరి

కాశినాయన జ్యోతి క్షేత్రంలో ఇకమీదట ఎలాంటి కూల్చివేతలు జరగవని ఖాదీ, గ్రామీణ పరిశ్రమల శాఖ చైర్మన్ కె.కె. చౌదరి తెలిపారు ఆయన బుధవారం తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ దూతగా జ్యోతి క్షేత్రాన్ని సందర్శించారు. జ్యోతి క్షేత్రంలో కూల్చివేతల విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ తనను ఇక్కడికి పంపారన్నారు. కూల్చివేతలు జరిగినా ప్రతి స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలిం చానని పేర్కొన్నారు. ఆలయంలో నష్టం వాటిల్లితే మంత్రి లోకేష్ తన సొంత నిధులతో మళ్లీ పునర్నిర్మించేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కొంతమంది రాజకీయ పార్టీ నాయకులు, అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నారని, ఇది సరైంది కాదని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లి కేంద్ర మంత్రులతో మాట్లాడి కాశినాయన క్షేత్రానికి పర్మిషన్ తెచ్చే బాధ్యత కూడా తామే తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఆయన వెంట టిడిపి నాయకులు రవీంద్రారెడ్డి, గురువిరెడ్డి, రాజారెడ్డి, రోహిత్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, కృష్ణారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యువత భవితను దెబ్బతీసింది జగనే

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఎన్నికలలో చిత్తుచిత్తుగా ఓడిపోయి అధికారం కోల్పోయి మతిభ్రమించిన జగన్ రెడ్డి యువత, విద్యార్థులను రెచ్చగొట్టే విధంగా ఫీజు పోరు, యువత పోరుతో దొంగాట ఆడడం తగదని, యువత భవితను దెబ్బ తీసింది జగనే అని నిరుద్యోగ జెఎసి రాష్ట్ర కన్వీనర్ షేక్ సిద్ధిక్, టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ తిరుమలేష్ తెలిపారు. బుధవారం కడప నగరంలోని వైఎస్ఆర్ ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ హయాంలో నిరుద్యోగ శాతం పెంచి, విద్యార్థులకు ఫీజు బకాయిలు పెట్టి ఇప్పుడు యువత పోరు ఫీజు పోరు అని డ్రామాలాడుతూ రోడ్లెక్కడం సిగ్గుచేటన్నారు. వైసిపి ఉనికి కోసమే యువత పోరు అంటూ అసెంబ్లీకి వెళ్లకుండా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తుందని మండిపడ్డారు.

3, 4, 5వ తరగతుల విలీనాన్ని ఆపాలి

ప్రజాశక్తి-చెన్నూరు : చెన్నూరు క్లస్టర్ కాంప్లెక్స్ అనంతరం 3,4,5 తరగతుల విలీనాన్ని ఆపాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజ మాట్లాడుతూ పంచాయతీకి ఒక మోడల్ స్కూల్ అని చెప్పిన ప్రభుత్వం, మోడల్ ప్రైమరీ స్కూల్స్ ఏర్పాటు చేయడానికి అడుగులు వేస్తున్నట్లు కన్పిస్తోందని పేర్కొన్నారు. ప్రైమరీ స్కూలుకు ఐదు కిలోమీటర్ల పరిధిలో ఉన్న అన్ని ప్రాథమిక పాఠశాలలో ఉన్న 3,4,5 తరగతులను విలీనం చేయడానికి వేగవంతంగా అడుగులు వేస్తోందన్నారు.ఈ విధానం వల్ల ప్రాథమిక విద్యావ్యవస్థ కునారెల్లిపోతుందని వాపోయారు. విలీనాన్ని ఆపి యథావిధిగా తరగతులు నిర్వహించాలని చెప్పారు. లేకపోతే ఉద్యమాలు నిర్వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు వెంకటసుబ్బయ్య, బాబురెడ్డి, వీరనారాయణ, శ్రీనివాసులు, వెంకటేశ్వరరెడ్డి, మధుసూదన్ పాల్గొన్నారు.

అసంబద్ధమైన విధానాలు విడనాడాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : 3,4,5 తరగతుల విలీన ప్రక్రియను అసంబద్ధమైన పద్ధతిలో చేపట్టడాన్ని విడనాడాలని ఎస్‌టియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇలియాస్ బాషా, సంగమేశ్వర్ రెడ్డి కోరారు. ఆయన విలేకర్లతో మాట్లాడుతూ చింతకొమ్మదిన్నె మండలం అంగడివీధి క్లస్టర్ స్కూల్ సమావేశాల సందర్భంగా కాంప్లెక్స్ సమావేశాలకు హాజరైన ఉపాధ్యాయులతో కలిసి విద్యాశాఖ పాఠశాలల పునర్విభజన ప్రక్రియతో చేపట్టిన 3,4,5 తరగతుల విలీన ప్రక్రియలో ఎస్ఎంసి తీర్మానాలను పరిగణలోకి తీసుకోకపోవడం దారుణమన్నారు.

ఇంటి పట్టాలపై సమగ్ర విచారణ జరపాలి

సిపిఎం నగర కార్యదర్శి ఎ.రామ్మోహన్

సమావేశంలో మాట్లాడుతున్న రామ్మోహన్

ప్రజాశక్తి-కడప అర్బన్

నగరంలోని 15వ డివిజన్ సరోజినీ నగర్ దగ్గర ఉన్న ఆచార్య కాలనీలో ఇంటి పట్టాలు, ఇళ్ల స్థలాలను భూకబ్జాదారులు యథేచ్ఛగా అమ్ముకుంటున్నారని, తక్షణమే తహశీల్దార్ సమగ్ర విచారణ చేపట్టాలని సిపిఎం నగర కార్యదర్శి ఎ. రామ్మోహన్ కోరారు. బుధవారం సిపిఎం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆచార్య కాలనీలో 30 ఏళ్ల కిందట బడుగు, బలహీన వర్గాలకు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించుకున్న వారికి, క్రిస్టియన్ మైనార్టీలకి, ఇళ్ల స్థలాలు ఇచ్చారని పేర్కొన్నారు. ఇప్పుడు వాటిని కొంతమంది బినామీ పేర్లతో దొంగ పట్టాలు సృష్టించి అమ్ముకుంటున్నారని తెలిపారు. దీనిపై మండల తహశీల్దార్, రెవెన్యూ అధికారులు సమగ్ర విచారణ చేసి భూ కబ్జాదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కొంతమంది రెవెన్యూ అధికారులు భూకబ్జాదారులకు వత్తాసు పలకడంతో గతంలో ఇక్కడ పనిచేసిన తహశీల్దార్ పేరుతో దొంగ పట్టాలు సృష్టించి ఆచార్య కాలనీలో భూ కబ్జాలకు పాల్పడుతున్నారని చెప్పారు. గతంలో ఇచ్చిన కొంతమందికి పట్టా స్థలాలు ఉన్నా కూడా అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు భూ కబ్జాదారులతో చేతులు కలిపి దాడులకు, దౌర్జన్యాలకు బెదిరింపులకు దిగుతున్నారని పేర్కొన్నారు. తక్షణమే తహశీల్దార్ విచారించి ఇళ్లు లేని పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆచారి కాలనీ భూ కబ్జా దారులపై సిపిఎం ఆధ్వర్యంలో దశలవారీగా ఆందోళన, పోరాటాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దస్తగిరి రెడ్డి, నగర నాయకులు గోవిందు, నరసింహ పాల్గొన్నారు.

డ్రగ్స్ నియంత్రణకు డివైఎఫ్ఐ కృషి అభినందనీయం

ప్రజాశక్తి - బద్వేలు

పోస్టర్ ఆవిష్కరిస్తున్న కమిషనర్, డివైఎఫ్ఐ నాయకులు

డ్రగ్స్ నియంత్రణకు డివైఎఫ్ఐ కృషి అభినందనీయమని మున్సిపల్ కమిషనర్ వి.వి. నరసింహారెడ్డి పేర్కొన్నారు. డివైఎఫ్ఐ జిల్లా కమిటీ మాదక ద్రవ్యాల నివారణకై ముద్రించిన పోస్టర్స్‌ను బుధవారం డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం నందు మున్సిపల్ కమిషనర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బద్వేల్ మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ యువత మత్తు, మాదక ద్రవ్యాలు వంటి జోలికి వెళ్ళవద్దని, దూరంగా ఉండాలని సూచించారు. యువత చెడు వ్యసనాలకు అలవాటు పడి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, ఇప్పటికే జిల్లాలో గంజాయి మత్తుపదార్థాల వంటి వాటిని అరికట్టడానికి పోలీస్ యంత్రాంగం ఉక్కు పాదం మోపిందని చెప్పారు. డ్రగ్స్ నివారణకై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న డివైఎఫ్ఐ యువజన సంఘానికి నాయకత్వానికి అభినందించారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని మాట్లాడుతూ యువతను డ్రగ్స్ మత్తు పదార్థాల వంటి చెడు వ్యసనాల వైపు నుండి మంచి మార్గం వైపు నడపడం కోసం డివైఎఫ్ఐ యువజన సంఘం అవగాహన కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నామని అన్నారు రాష్ట్రంలో డ్రగ్స్ గంజాయి వంటి వాటికి యువత అలవాటు పడి నిండు జీవితాన్ని భావితరాల యువత నాశనం చేసుకుంటున్నారు యువతకు ఉద్యోగ ఉపాధ్యాయ అవకాశాలు అంటివి లభిస్తే ఇటువంటి వాటిపైకి ఆలోచన ఉండదన్నారు. కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ లాంటి ఒక భారీ పరిశ్రమ వచ్చి యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తే ఈ ప్రాంతం అభివృద్ధితోపాటు యువత చెడు వ్యసనాల వంటివి వైపు వెళ్లకుండా ఉండే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సి.సి ముద్దుకృష్ణ డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు షేక్ మస్తాన్ షరీఫ్, షేక్ ఆదిల్ బాషా, పట్టణ నాయకులు కె. రామకృష్ణ, ప్రసాద్ రెడ్డి, రాజు, మనోహర్, మహమ్మద్ పాల్గొన్నారు.

ఘనంగా వైసిపి ఆవిర్భావ వేడుకలు

ప్రజాశక్తి - కడప : కడప వైసిపి జిల్లా కార్యాలయం వద్ద ఘనంగా పార్టీ 15వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి పార్టీ జెండాను జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథ్ రెడ్డి ఆవిష్కరించారు. తొలుత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా కడప మేయర్ కె.సురేష్ బాబు, బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ సుధా, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, రఘురామిరెడ్డి, సతీష్ కుమార్ రెడ్డి, నరేన్‌రెడ్డి, కడప జిల్లా మహిళా అధ్యక్షులు తెలుగు పులి వెంకటసుబ్బమ్మ, జిల్లా, నగర అనుబంధ సంఘాల నాయకులు, అధ్యక్షులు, వైయస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

16న మాజీ సైనికుల ర్యాలీ

ప్రజాశక్తి - కడప : మాజీ సైనికులు చేసిన సేవలను గుర్తించి, వారి సమస్యల పరిష్కారానికి ఈ నెల 16న స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మాజీ సైనికుల భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు జిల్లా సైనిక సంక్షేమశాఖాధికారి యం.డి.రజాక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యక్ష సేవలు, సంక్షేమ పథకాలు, వితంతువుల గౌరవం, ఆర్థిక సహాయం, వైద్య, ఆరోగ్యసేవలు, పింఛన్, భూ సమస్యలు, విద్యా అవకాశాలు, వైకల్య పింఛను, సిఎస్‌డి సేవలు తదితర అంశాలపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో ర్యాలీని నిర్వహిస్తామని పేర్కొన్నారు. ర్యాలీతోపాటు వైద్య శిబిరం ఏర్పాటు చేసి ఉచిత వైద్య పరీక్షలు చేస్తామని పేర్కొన్నారు.

నలంద విద్యార్థులకు జాతీయ స్థాయి అవార్డులు

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఐఐటి -జెఇఇ/ఎన్ఇఇటి ఫలితాలలో జాతీయస్థాయిలో విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి అవార్డులను కైవసం చేసుకున్నారని శ్రీ నలంద పాఠశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జి. లక్ష్మణస్వామి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆల్ ఇండియా మ్యాథమెటిక్స్ అండ్ సైన్స్ ఒలంపియాడ్ వారు ఎంతో ప్రతిష్టాత్మంగా నిర్వహిస్తున్న పోటీ పరీక్షలలో 5వ తరగతి నుంచి పి.ప్రవీణ, స్టేట్ 3వ ర్యాంక్ ను, 8వ తరగతి నుంచి ఎస్.తేజ శ్రీ జోనల్ స్థాయి అవార్డులను సొంతం చేసుకున్నారని చెప్పారు. ఈనెల 9 న హైదరాబాద్ రవీంద్ర భారతి ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో బహుమతులు అందుకున్నారు. ముఖ్య అతిథులుగా సినీ గాయకులు, మోటివేషనల్ స్పీకర్ ప్రభాకర్ రావు, యూనిక్ చిల్డ్రన్స్ అకాడమీ ఫౌండర్ ఖలీమ్ ఖాన్ చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారని తెలిపారు.తమ పాఠశాల చిన్నారులు జాతీయ స్థాయికి ఎంపిక కావడం, పెద్ద కళాక వేదిక పై నుంచి బహుమతులను అందుకోవడం చాలా ఆనందాన్ని కలిగించిందని చెప్పారు. పాఠశాల కరస్పాండెంట్ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులకు నేటి సమాజానికి అనుగుణంగా విద్యను బోధించడంలో శ్రీ నలంద యాజమాన్యం ఎంతగానో కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఐఐటి శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణమ్మ, శివ, ప్రమీల, వైశాలి, కరుణశ్రీ, బాబు విద్యార్థులను అభినందించారు.

వ్యాధుల నివారణలో ప్రజల భాగస్వామ్యం అవసరం

ప్రజాశక్తి-కడప అర్బన్

సిబ్బందిని అభినందిస్తున్న డాక్టర్ నాగరాజు

సీజనల్ వ్యాధుల నివారణలో ప్రజల భాగ స్వామ్యం ఎంతైనా అవసరం కడప జోనల్ మలేరియా అధికారి డాక్టర్ కె.లక్ష్మీ నాయక్ అన్నారు. బుధవారం రాయలసీమలోని 8 జిల్లాలకు సంబంధించిన సబ్ యూ నిట్ మలేరియా అధికారులకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కాన్ఫరెన్స్ హాల్‌లో సీజనల్ వ్యాధుల పైన ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కడప జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు సమావేశంలో ప్రసంగిస్తూ ప్రజల భాగస్వామ్యం సీజనల్ వ్యాధుల నివారణలో ఎంతైనా అవసరమని చెప్పారు. గ్రామాలలో హడావుడి పడకుండా మొక్కుబడిగా ఫ్రైడే కార్యక్రమాలను చేయ రాదని పేర్కొన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ఆదేశాల మేరకు రాయలసీమలోని ఎనిమిది జిల్లాలలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఒక ప్రణాళిక బద్ధంగా కార్యక్రమాలను ముందుకు తీసుకు వెళ్లడానికి శిక్షణ కార్యక్రమం సిబ్బంది ఏర్పాటు చేశామని తెలిపారు. కడప జోనల్ మలేరియా అధికారి డాక్టర్ కె లక్ష్మీ నాయక్ మాట్లాడుతూ 8 జిల్లాలలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాలను నూటికి నూరు శాతం వైద్య ఆరోగ్య సిబ్బంది ఫీల్డ్‌లో పర్యటించినప్పుడు దోమలను ఉత్పత్తి చేసే బ్రీడింగ్ స్థలాలను తప్పనిసరిగా గుర్తించాలన్నారు. దోమల నివారణ చర్యలకై ఎనిమిది జిల్లాలలో ముందు జాగ్రత్తగా మలేరియా వర్కర్ల చేత క్రిమిసంహారక మందులను గ్రామాలలో తప్పనిసరిగా స్ప్రేయింగ్ చేయించాలని పేర్కొన్నారు. మలేరియా వ్యాధి నిర్మూలనకు తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలను మలేరియా లైఫ్ సైకిల్ గురించి కడప జిల్లా మలేరియా అధికారి మనోరమ సమావేశంలో వివరించారు. కడప మైక్రో బయాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ నాగ సుధారాణి, కర్నూలు, చిత్తూరు జిల్లాల మలేరియా నివారణ అధికారులు ఏ నూకరాజు బి. వేణుగోపాల్ గ్రామాలలో వ్యక్టార్ కంట్రోల్ స్ప్రింగ్ టెక్నిక్స్ గురించి ఐఆర్ఎస్, ఇతర కెమికల్ మెథడ్స్ లో అవలంబించాల్సిన పద్ధతులను గురించి సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. 110 మంది మలేరియా సబ్ యూనిట్ అధికారులు వెక్టార్ బార్న్ వ్యాధులలో దోమ ఉత్పత్తి చందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను, నివారణ చర్యలను గురించి చర్చించారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశీలకులు పార్వతీశం, అధికారులు పాల్గొన్నారు.

నగదు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

హైస్కూల్‌కు పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

స్థానిక ముద్దనూరు రోడ్డులో ఉన్న జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో అభివృద్ధి పనుల నిమిత్తం పూర్వ విద్యార్థులు ఆర్థికసాయం చేసినట్లు ప్రధాన ఉపాధ్యాయులు రామాంజనేయులరెడ్డి తెలిపారు. పాఠశాలలో బుధవారం ఆయన మాట్లాడుతూ 2002-03 విద్యా సంవత్సరం విద్యార్థులు రూ.50వేలు ఇచ్చారని తెలిపారు. ఈ మొత్తంతో ప్రహరీకి పెయింటింగ్ వేయించి, దేశ నాయకుల చిత్రపటాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. అదే బ్యాచ్‌కు చెందిన హనుమారెడ్డి 20మూటల సిమెంటు ఇస్తానని తెలిపారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గురుభాస్కర్‌రెడ్డి, చంద్రబాబురెడ్డి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

నృత్యాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

పాఠశాలను మొదటి స్థానంలో నిలపాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

ఈనెల 17న జరగనున్న పది పరీక్షల్లో విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి వంద శాతం ఉత్తీర్ణత సాధించి, పాఠశాలను మొదటి స్థానంలో నిలపాలని ప్రధానోపాధ్యాయులు ఆవుల శ్రీనివాసులు విద్యార్థులకు సూచించారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం శ్రీనివాసులు ఆధ్వర్యంలో 9వ తరగతి విద్యార్థులు పది విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు సంతోషంగా ఆట, పాటలతో గడిపారు. భోజన వసతి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సరస్వతి చిత్రపటం వద్ద అధ్యాపకులు, విద్యార్థులు

నేటి విద్యార్థులే.. రేపటి పౌరులు

ప్రజాశక్తి - చక్రాయపేట

నేటి విద్యార్థులే రేపటి పౌరులని ఎంఇఒ-2 వెంకట రవికుమార్ పేర్కొన్నారు. మహాదేవపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చక్రాయపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశాలను ఆయా ప్రధానోపాధ్యాయులు రామాంజులు, రవికుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా పదవ తరగతి హాల్ టికెట్లను సరస్వతి చిత్రపటం వద్ద పెట్టి ప్రత్యేకపూజలు నిర్వహించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్న ఖలీల్ సౌదాగర్

క్రమం తప్పకుండా స్కూల్‌కు రావాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

విద్యార్థులు ప్రతిరోజూ క్రమం తప్పకుండా స్కూల్‌కు రావాలని ఎస్ఎంఎస్ కంపెనీ సిఇఒ ఖలీల్ సౌదాగర్ కోరారు. వేముల మండలం మబ్బుచింతలపల్లె ఎంపిపి పాఠశాలకు బుధవారం యురేనియం ప్రాజెక్ట్‌లోని ఎస్ఎంఎస్ కంపెనీ తరపున కుర్చీలు అందజేశారు. విద్యార్థులకు పుస్తకాలు, రైటింగ్ ప్యాడ్స్, పెన్సిల్ బాక్స్‌లు, కంపాస్ బాక్స్‌లు, స్కేల్, మ్యాపులు, సైన్స్ చార్ట్‌లు తదితర వాటిని ప్రధానోపాధ్యాయుడు రామాంజులరెడ్డి, ఉపాధ్యాయుడు చంద్రశేఖర్‌రెడ్డి సమక్షంలో పంపిణీ చేశారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు సిఇఒ ఖలీల్ సౌదాగర్‌కు, డిజిఎం సురేష్‌బాబుకు ధన్యవాదాలు తెలిపారు, అనంతరం ఖలీల్ సౌదాగర్ మాట్లాడుతూ శ్రద్ధగా చదువుకొని మంచి విద్యార్థులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కంపెనీ సిబ్బంది పాల్గొన్నారు

ఆశ్రమాలు కూల్చడం.. సనాతన ధర్మమా..!

- పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

కూటమి ప్రభుత్వానికి అన్నదాన సత్రాలను, ఆశ్రమాలను కూల్చాడమేనా సంపద సృష్టి, సనాతన ధర్మం అని సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్‌ను ఉద్దేశించి పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ తులసిరెడ్డి పేర్కొన్నారు. స్థానికంగా బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బద్వేల్ నియోజక వర్గంలోని కాశినాయన మండలం, జ్యోతి క్షేత్రంలో ఉన్న కాశిరెడ్డి నాయన గుడికి సంబంధించిన విశ్రాంతి గదులను, స్నానపు గదులను, గోశాలను, క్షౌర శాలను అటవీ, పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు కూల్చడం అత్యంత దురదృష్టకరమన్నారు. 1999లో నరసాపురం కేంద్రంగా కాశినాయన మండలం ఏర్పాటైందన్నారు. ప్రభుత్వ నిధులతో రోడ్డు, విద్యుత్ సరఫరా, తాగునీటి సరఫరా, బిఎస్ఎన్ఎల్ టవర్ ఏర్పాటు చేశారన్నారు. అటవీ శాఖ అనుమతులు లేవని కట్టడాలను కూల్చడం అమానుషమన్నారు. అనుమతులు లేకుంటే తెప్పించాలి కాని కూల్చడమేంటని ఆయన ప్రశ్నించారు. కూల్చిన కట్టడాలను పునరుద్ధరించాలని, కాశి నాయన గుడిని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు.

సత్రం పునర్నిర్మాణం ప్రకటన పట్ల హర్షం

ప్రజాశక్తి - ఖాజీపేట

జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాశిరెడ్డి నాయన ఆశ్రమంలో అటవీ అధికారులు కూల్చిన అన్నదాన సత్రాన్ని పునర్నిర్మాణం పట్ల రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ ప్రకటించడం హర్షణీయమని సన్నపల్లె టిడిపి యువనాయకులు సోమల త్రివిక్రమ్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. హిందువుల మనోభావాలను దృష్టిలో ఉంచుకొని అధికారులు చేసిన తప్పిదాలను సరిదిద్ది తక్షణమే అన్నసత్ర నిర్మాణానికి చర్యలు చేపడతామనడం సంతోషకరమన్నారు.

వేసవి తాపాన్ని తీర్చే కర్బూజా

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

వేసవిలో కలింగర కాయకు (కర్భూజ) మంచి గిరాకీ ఉంటుంది. అన్ని వయసుల వారు ఈ కాయను చాలా ఇష్టంగా తింటారు. కొందరు కాయకు గాటు పెట్టి అందులో చక్కెర వేసి కొద్ది సేపు ఉంచి చాలా ఇష్టంగా తింటుంటారు. వేసవిలో ఉపశమనం పొందేందుకు పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా తింటారు. వేసవిలో కలింగర కాయ తినడం వల్ల చాలా ఉపయోగాలున్నాయి. కాయ తీపు పదార్థం అయినప్పటికీ చక్కెర నిల్వలు తక్కువగా ఉండడంతో డయాబెటిస్ ఉన్నవారు కూడా పరిమితంగా తీసుకోవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. ఇవి వేసవిలో మాత్రమే లభిస్తాయి. వేసవి రావడంతో బజారుల్లో కలింగర కాయలు దర్శనమిస్తున్నాయి. ఎండలో తిరిగి వస్తే కలింగంర ఒప్పు తినాలనిపిస్తుంది. కలింగరలో నాణ్యత, రుచి ఎక్కువ. బి విటమిన్లు, పొటాషియం పుష్కలంగా ఉంటాయి. కళింగర కాయ నుంచి ఎలక్ట్రోలైట్లు సమృద్ధిగా అందుతాయి. బి విటమిన్లు శరీరానికి శక్తినందిస్తే.. పొటాషియం గుండెకు మేలు చేస్తుంది. వడదెబ్బ బారినపడి శరీరం నిస్తేజం కాకుండా కాపాడుతుంది. వేడికి కమిలిన చర్మానికి చల్లని పుచ్చకాయ గుజ్జును రాస్తే తిరిగి చర్మం నిగారింపు సంతరించుకుంటుంది. రక్తపోటు ఉన్నవారు పుచ్చకాయ తింటే ఎంతో మేలు. ఇందులో ఉండే పొటాషియం, మెగ్నీషియం ఇందుకు కారణం. కలింగరలో 92 శాతం ఆల్కలైన్ వాటర్ ఉంటుంది. ఇది శరీరానికి ఎంతో మేలు చేస్తుంది. మూత్రపిండాలు, మూత్ర నాళాల్లో ఇబ్బందులు ఉన్నవారికి పుచ్చకాయ వరం లాంటిది. లోపలంతా గింజలతో నిండి ఉండి ఈ కలింగరలో అనేక లాభాలున్నాయి. టమోటాలో ఉన్నట్లు కలింగరలో లైకోఫిన్ అనే యాంటీ ఆక్సిడెంట్ ఉంటుంది. ఒక గ్రాము టమాటోలో 40 మైక్రో గాములుంటే కలింగరలో 72 మైక్రోగ్రాములు ఉంటుంది. వేసవిలో కళింగర కాయలు ఆరోగ్యానికి ఎంతో దోహదపడుతాయని చెప్పవచ్చు.

టైలరింగ్ శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

టైలరింగ్‌లో మహిళలకు ప్రభుత్వం శిక్షణ ఇస్తుందని, ఆసక్తిగల మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ శేషఫణి తెలిపారు. తన కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ జమ్మలమడుగు నియోజకవర్గ వ్యాప్తంగా మూడు వేల మందికి టైలరింగ్‌లో ప్రభుత్వం శిక్షణ ఇవ్వనుందని తెలిపారు. 22ఏళ్ల నుంచి 40ఏళ్లలోపు ఉన్న బిసి, ఒసి, కమ్మ మహిళలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎస్‌సి, ఎస్‌టిలకు ఈ పథకం వర్తించదన్నారు. దరఖాస్తుదారులు ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, బిసిలు కుల ధ్రువీకరణ కార్డు తీసుకొని సచి వాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. శిక్షణ పూర్తయ్యాక వారికి అవసరమైన టూల్ కిట్టు, కుట్టుమిషన్లు మంజూరు చేస్తారన్నారు. ప్రొద్దుటూరు రోడ్డులోని లే అవుట్‌లో ఇందిరమ్మ కాలనీలో కనీస వసతులకు సంబంధించిన విద్యుత్, రోడ్లు, తాగునీరు, వీధిలైట్లు పనులు జరుగుతున్నాయని వివరించారు. వేంపల్లి రోడ్డులో డ్రయినేజీ కాలువ కింద నీటి పైప్‌లైన్ ఉందన్నారు. అందువల్ల నీరు కలుషి తమయ్యే ప్రమాదం ఉందని, కొత్త పైప్‌లైన్ నిర్మాణానికి ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి రూ.50 లక్షలు మంజూరు చేయించారని తెలిపారు. త్వరలో టెండర్లు పిలుస్తామన్నారు.

మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శేషఫణి

రూ.3కోట్లతో పైప్‌లైన్ పనులు పట్టణంలో జరుగుతున్నాయని అన్నారు. ఇందుకు పివిసి పైపులు వాడకుండా ఎక్కువ మన్నిక రావాలని హెచ్‌డిపి పైపులు వాడుతున్నామని వివ రించారు.

డ్రయినేజీ వ్యవస్థపై దృష్టి పెడతాం..

పట్టణ వాసుల ప్రధాన సమస్య డ్రయినేజీ వ్యవస్థపై దృష్టి పెడతామని కమిషనర్ శేషఫణి పేర్కొన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పైప్‌లైన్ పనులు పూర్తికావాలన్నారు. పట్టణానికి సంబంధించి డిపిఆర్ (వివరణాత్మక ప్రణాళిక గల ప్రాజెక్టు రిపోర్ట్)ను సంబంధిత ఇంజినీరింగ్ ఏజెన్సీ ద్వారా తయారు చేస్తామన్నారు. పట్టణంలో 14 శాతం మాత్రమే డ్రయినేజీ వ్యవస్థ ఉందన్నారు. మురుగు నీరు వెళ్లేందుకు వసతి లేక ఈ పనుల అభివృద్ధి జరగలేదన్నారు. ఒక ప్రణాళిక ద్వారా డ్రయినేజీ నిర్మించి ఎస్‌టిపి (మురుగునీటి శుద్ధి కర్మాగారం)ను రెండు చోట్ల ఏర్పాటు చేయించాల్సి ఉందన్నారు. రైల్వే ట్రాక్ అవతల ఒక ఎస్‌టిపి, వేంపల్లి రోడ్డులో మరొక ఎస్‌టిపి ఏర్పాటు చేసి.. కడప రోడ్డులో డ్రయినేజీని వలసపల్లె రోడ్డులోని కాలువలో కలిపేందుకు కృషి చేస్తామన్నారు. ఇలా ఎస్‌టిపి ద్వారా శుద్ధి అయిన నీటితో పంటలు పండించుకోవచ్చని తెలిపారు. తాగడానికి తప్ప అన్ని అవసరాలకు ఎస్‌టిపి నీరు వాడవచ్చని వివరించారు. ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి పట్టణ అభివృద్ధిపై ప్రత్యేకదృష్టి సారించారని అన్నారు. డ్రయినేజీపై డిపిఆర్ చేయించాక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామని వివరించారు. పట్టణంలోని వీధుల్లో మురుగు కాలువల నిర్మాణం పూర్తయ్యాక సిమెంట్ రోడ్లపై దృష్టి పెడతామన్నారు.

చాపాడు : ఉచిత టైలరింగ్ శిక్షణ, కుట్టు మిషన్ల పంపిణీ పథకానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సీతారామాపురం పంచాయతీ కార్యదర్శి జానకిరామ్ తెలిపారు. ఈనెల 22లోగా గ్రామ సచివాలయంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆధార్, రేషన్‌కార్డులు, కుల ధ్రువీకరణ పత్రం, ఫోన్ నెంబర్‌తో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హతగల మహిళలు వినియోగించుకోవాలన్నారు.

మండలంలో నీటి ఎద్దడి తలెత్తకుండా చూస్తాం

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె మండల వ్యాప్తంగా వేసవి కాలంలో నీటి ఎద్దడి తలెత్తకుండా నివారించేందుకు టిడిపి పులివెందుల ఇన్‌ఛార్జి బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డి ద్వారా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని ఆ పార్టీ మండల పరిశీలకుడు రఘునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వేంపల్లె గ్రామ పంచాయతీ కార్యదర్శిగా సుబ్బారెడ్డిని కొన్ని సాంకేతిక కారణాలతో సస్పెండ్ చేశారన్నారు. దీనిపై కూడా కలెక్టర్‌తో బిటెక్ రవి మాట్లాడారని తెలిపారు. పులివెందుల నియోజకవర్గంలో వేంపల్లె మేజర్ గ్రామ పంచాయతీ కావడం పట్ల ఇఒ అవసరమని, వేసవిలో నీటి సమస్య రాకుండా ఉండేందుకు ఇఒను త్వరితగతిన నియమించేందుకు చర్యలు తీసుకొంటామని చెప్పారు. వైసిపి పాలనలో పాపాఘ్ని నదిలో అక్రమంగా ఇసుక తవ్వకాలు చేయడంతో భూగర్భ జలాలు అడుగంటిపోయాయని తెలిపారు. తద్వారా ఆయా ప్రాంతాల్లో నీటి సమస్య తలెత్తే అవకాశం ఉందన్నారు. నీటి ఎద్దడి వచ్చే ప్రాంతాలను గుర్తించామన్నారు. మూడు రోజుల్లో పంచాయతీ కార్యదర్శిని నియమించేందుకు చర్యలు తీసుకొంటామని హామీ ఇచ్చారు. సమావేశంలో టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, బాలస్వామిరెడ్డి, జగన్నాథరెడ్డి, తెలంగాణ వలి, అల్లా బకష్, వీరభద్ర, డక్కా రమేష్, మహమ్మద్, వేమకుమార్, శేషారెడ్డి, జబి బుల్లా, బాలకృష్ణారెడ్డి, రామకృష్ణారెడ్డి, బాషా యాసిన్, గంగాధర్‌రెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్‌రెడ్డి

సబ్ రిజిస్ట్రార్‌పై చర్యలు తీసుకునేలా చూడండి

వేంపల్లె సబ్ రిజిస్ట్రార్‌పై చర్యలు తీసుకునేలా అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని టిడిపి నేత ఎద్దుల శేషారెడ్డి కోరారు. ఆ మేరకు బుధవారం వేంపల్లెకు విచ్చేసిన టిడిపి మండల పరిశీలకుడు రఘు నాథ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కోర్టు ఇచ్చిన ఆదేశాలను ధిక్కరించి వేంపల్లె సబ్ రిజిస్ట్రార్ లీలావతికి చెందిన భూమిని ఇతరులకు రిజిస్ట్రేషన్ చేశారన్నారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని శేషారెడ్డి కోరారు.

మైదుకూరు హైస్కూల్ ఆవరణలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

పాఠశాలల విలీన నిర్ణయం మానుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

ప్రభుత్వం పాఠశాలల విలీన ప్రక్రియ నిర్ణయం మానుకోవాలని ఉపాధ్యాయులు కోరారు. మైదుకూరు, నంద్యాలంపేట క్లస్టర్ కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులు బుధవారం పాఠశాలల విలీన కార్యక్రమంపై కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఎస్ఎంసిల తీర్మాణాల అభీష్టం మేరకు విలీన ప్రక్రియ ఉండాలన్నారు. ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావలసిన డిఎ, ఏపీజిఎల్ఐ, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లుల బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. కమిటీ వేసి పీఆర్సీ ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌టియు మండల శాఖ అధ్యక్షులు రమణయ్య, రాష్ట్ర కౌన్సిలర్ పాలకొండయ్య, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు మల్లేశ్వరరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ యాపరాల వెంకటసుబ్బయ్య, ఆవుల శ్రీనివాసులు, గోశెట్టి రామమోహన్, యూనియన్ నాయకులు విజయుడు, నరసింహ రాజు, జిల్లా ఉపాధ్యక్షులు బికె సురేష్, కృష్ణయ్య, కిరణ్‌కుమార్, నారాయణ ప్రసాద్, నాగరాజు, కుమార్, జనార్ధన్, శ్రీదేవి, భారతి పాల్గొన్నారు.

రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేస్తున్న రేషన్ బియ్యాన్ని లబ్ధిదారులందరికీ పంపిణీ చేయాలని తహశీల్దార్ హరినాథ్‌రెడ్డి ఆదేశించారు. చింతలమడుగు పల్లె రేషన్ షాపును బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ వివరాలను డీలర్లు అరుణ, మహేష్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రతి నెల 1వ తేదీ నుండి 17 వరకు రేషన్ బియ్యాన్ని పంపిణీ చేయాలని సూచించారు. స్టాక్ పెట్టుకొని బియ్యం పంపిణీ చేయక పోతే అలాంటి డీలర్లపై చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. బియ్యం కోసం అనేక మంది ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. అవి రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత డీలర్లదే అన్నారు. స్టాక్ పూర్తిగా అయిపోయే వరకు బియ్యం పంపిణీ చేయాలన్నారు. రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

హోలిస్టిక్ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ, ఇహెచ్ఎస్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరులోని హోలిస్టిక్ ఆస్పత్రిలో పలు రకాల వ్యాధులకు ఆరోగ్యశ్రీ, ఇహెచ్ఎస్ సేవలు అందుబాటులో ఉన్నాయని సిఇఒ శరత్‌బాబు తెలిపారు. ఆస్పత్రిలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గుండె, ఎముకల సంబంధిత సమస్యలకు, యాక్సిడెంట్ కేసులకు, తల, నరముల సంబంధిత సమస్యలకు ఎన్‌టిఆర్ ఆరోగ్యశ్రీ ద్వారా ఒపి ఉచితంగా చూసి, అవసరమైన వారికి సర్జరీలు ఉచితంగా చేస్తామన్నారు. ప్రొద్దుటూరు మండలంలో మొదటిసారిగా కార్డియాలజీ, కార్డియోథొరాసిస్ సర్జరీ, న్యూరో సర్జరీ, న్యూరాలజీ, జనరల్ సర్జరీ, ఆర్థోపెడిక్, పాలిటామా గైనకాలజీ, పీడియాట్రిక్స్ క్రిటికల్ కేర్ సంబంధిత సమస్యలన్నిటికీ ఎన్‌టిఆర్ ఆరోగ్యశ్రీ ద్వారా సేవలు అందిస్తామన్నారు. ప్రొద్దుటూరు చుట్టుపక్కల ఉన్న జమ్మలమడుగు, మైదుకూరు, ఎర్రగుంట్ల, ముద్దనూరు తదితర మండలాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఆరోగ్యశ్రీ కార్డులేని వారి కోసం ప్రత్యేకమైన కార్డియాక్ హెల్త్ ప్యాకేజ్, డయాబెటిక్ హెల్త్ ప్యాకేజీని ప్రారంభించారు. రూ.3,700 విలువగల టెస్టులను కేవలం రూ.499కు డయాబెటిక్ ప్యాకేజీ అందిస్తామన్నారు. రూ.4,000 విలువగల కార్డియాక్ హెల్త్ ప్యాకేజీని కేవలం రూ.999 లభిస్తుందన్నారు. 40ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించి ఈ ప్యాకేజీలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఆరోగ్యంగా ఉన్నా కూడా ఏడాదికోసారి హెల్త్ చెకప్ చేయించుకోవడం మంచిదన్నారు.

మఠంలో బహిరంగ వేలం

వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారి మఠంలో భక్తులు సమర్పించు తల వెంట్రుకలు ప్రోగు చేసుకునేందుకు బుధవారం బహిరంగ వేలం నిర్వహించారు. ఉత్కంఠంగా సాగిన బహిరంగ వేలం పాటలో రూ.93,25,000 తల వెంట్రుకల వేలాన్ని ఎంఆర్ ప్రాజెక్ట్ అనంతపురం వాస్తవ్యులు దక్కించుకున్నారు. తాత్కాలికంగా పుస్తక విక్రయశాల వేలం పాట వాయిదా వేశారు. పుస్తక విక్రయశాల తదుపరి వేలం పాట ఈనెల 21న నిర్వహిస్తామని ఫిట్‌పర్సన్, దేవాలయ శాఖ స్పెషల్ ఆఫీసర్ శంకర్ బాలాజీ తెలిపారు. వేలం పాట పిట్ పర్సన్, మేనేజర్ ఈశ్వరయ్యాచారి ఆధ్వర్యంలో నిర్వహించారు.

ముక్తియార్‌ను సన్మానిస్తున్న సినీ నటుడు అలీ

మధ్యతరగతి వారికి మంచి అవకాశం

-సినీ నటుడు అలీ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

హజ్, ఉమ్రా చేయాలనుకునే మధ్యతరగతి కుటుంబాలకు అల్ ఇన్ఫో టెక్ టూర్స్ అండ్ ట్రావెల్స్ యాజమాన్యం అందిస్తున్న అవకాశం మంచిదని సినీ నటుడు అలీ పేర్కొన్నారు. ట్రావెల్స్ కార్యాలయాన్ని అలీ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రావెల్స్ యాజమాన్యం కేవలం రూ.63,000 హజ్, ఉమ్రా యాత్ర సౌకర్యం కల్పిస్తున్నారన్నారు. ప్రతి ముస్లిం జీవితంలో ఒకసారి హజ్ లేదా ఉమ్రా యాత్ర చేయాలనేది ఆశయంగా ఉంటుందన్నారు. ఈ ఆశయాన్ని ట్రావెల్స్ వారితో సంప్రదించి నెరవేర్చుకోవాలన్నారు. ఈ మధ్యకాలంలో తక్కువ ఖర్చుతో యాత్రలు చేయిస్తామని కొంతమంది నమ్మ పలుకుతున్నారన్నారు. అలాంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు. అంజుమన్ మాజీ అధ్యక్షుడు ముక్తియార్‌ను అలీ సన్మానించారు. కార్యక్రమంలో ముస్లిం నాయకుడు అయూబ్ ఖాన్ పాల్గొన్నారు.

దేవుని మాన్యంపై కలెక్టర్, దేవాదాయ శాఖకు ఫిర్యాదు

ప్రజాశక్తి - చక్రాయపేట

మండల కేంద్రంలో వెలిసిన శ్రీ వెంకటేశ్వర స్వామి, వీరభద్రస్వామి దేవస్థాన మాన్యం ఆక్రమణకు గురవుతోందని దేవస్థాన ఛైర్మన్ అడ్వకేట్ రామాంజనేయులు రెడ్డి కలెక్టర్‌కు, దేవాదాయ శాఖ అధికారులకు గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు ఆయన మాట్లాడుతూ రాయచోటి-వేంపల్లి మెయిన్ రోడ్డులో ఉన్న దేవుని మాన్యంలో 443/ బి సర్వే నెంబర్లు ఆక్రమణకు గురయ్యాయని ఆరోపించారు. తక్షణమే సర్వే జరిపించాలని అధికారులను కోరారు. చర్యలు తీసుకోకుంటే కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

నాణ్యమైన ఎరువులు, మందులు అందించడమే లక్ష్యం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

రైతులకు నాణ్యమైన పురుగు మందులు, ఎరువులు అందించడమే లక్ష్యమని మాజీ సర్పంచ్ బుగ్గన్నగారి జయచంద్రారెడ్డి, ప్రభావతి దంపతులు పేర్కొన్నారు. మండలంలోని గురజాలలో బుధవారం అగ్రికల్చర్ పట్టభద్రుడైన ఘనశ్యామ్ సుందర్‌రెడ్డి ఆధ్వర్యంలో శ్రీప్రభావతి ఫర్టిలైజర్స్ దుకాణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు సరసమైన ధరలో నాణ్యమైన ఎరువులు, క్రిమిసంహారక మందులు విక్రయించనున్నట్లు తెలిపారు. రైతుల అభ్యున్నతే తమ లక్ష్యమని పేర్కొన్నారు. అన్ని రకాల కంపెనీల పురుగు మందులు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మాట్లాడుతున్న ఎఒ చంద్రశేఖర్‌రెడ్డి

ప్రకృతి వ్యవసాయం శ్రేయస్కరం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ప్రకృతి వ్యవసాయం వల్ల నేల, ఆరోగ్యం సుస్థిరమని ఎఒ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని దేవగుడి గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పిఎండిఎస్ వేయుటకు విత్తన గుళికలు తయారు చేసి రైతులకు వివరించామన్నారు. ప్రకృతి వ్యవసాయంలో ఖర్చు తక్కువ, దిగుబడి ఎక్కువ అన్నారు. భూమి సారవంతమవుతుందన్నారు. రుతుపవనాలు రాకముందు పొడి నేలలో 20 నుండి 30 రకాల విత్తనాలు విత్తడం వల్ల తక్కువ వర్షపాతం వచ్చినా మొలకలు వస్తాయన్నారు. ఎండ, వానకు భూమిని కప్పి ఉంచడం వల్ల భూమిలో సూక్ష్మజీవులను కాపా డుకోవచ్చన్నారు. అధిక వర్షం వచ్చినా చినుకులు నేరుగా భూమి మీద పడ కుండా మొక్కలపై పడతాయన్నారు. భూమిలో ఉన్న సారవంతమైన మట్టి కొట్టుకొనిపోకుండా నీరు భూమిలో ఇంకిపోయేలా చేస్తుందన్నారు. రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ పథకం గురించి వివరించారు. కార్యక్రమంలో విఎఎలు రాణి, వినోద్, ఐసిఆర్‌పి సావిత్రి, విజయమ్మ, విజయ్ ప్రతాప్, రైతులు పాల్గొన్నారు.

నిరుద్యోగ వ్యతిరేక సదస్సును జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - కడపఅర్బన్

ఈనెల 14 యుటిఎఫ్ భవనంలో నిర్వహించే నిరుద్యోగ సదస్సు జయప్రదం చేయాలని డివైఎఫ్ఐ నగర కార్యదర్శి విజయ్ పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని స్థానిక డివైఎఫ్ఐ కార్యాలయం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ యువతకు ఎన్నికలలో అనేక హామీలు ఇచ్చారని కానీ అవి అమలుకు నోచుకోలేదన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ అధికారంలోకి వస్తే దేశంలో ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పన చేస్తానని హామీ ఇచ్చినా నేటికీ అమలు కాలేదన్నారు. మేకిన్ ఇండియా, మేడిన్ ఇండియా పేరుతో ప్రచారం తప్ప ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లు కంపెనులు అయిన అదానీ, అంబానీలకు తాకట్టు పెడుతూ ఉన్న ఉద్యోగాలను తొలగిస్తున్నారన్నారు. విభజన హామీ అయిన కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కు కూడా కేంద్రం నిర్లక్ష్యం వహిస్తూ ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కు ముందుకు అడుగులు వేయడం లేదన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ రంగ సంస్థలో ఖాళీగా ఉన్న 2 లక్షల 30 వేల పోస్టులు భర్తీ చేస్తామని హామీ ఇచ్చినా అమలు కాలేదన్నారు. నదస్సుకు నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో నగర నాయకులు నరసింహ, అభినయ్, ఉదయ్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తిసర్కిల్) : ఎన్నికల వాగ్దానాల్లో ఇచ్చిన హామీల అమలుకోసం నిర్వహిస్తున్న నిరుద్యోగ సదస్సును జయప్రదం చేయలని సిపిఎం, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు పిలుపు నిచ్చారు. ఈనెల 14న కడప యూటీఎఫ్ భవ న్‌లో సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి నట్లు తెలిపారు. జిల్లా లోని నిరు ద్యోగ యువత పాల్గొనాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు సత్య నారాయణ, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎద్దు రాహుల్ కోరారు. ఆ మేరకు వారు బుధవారం స్థానిక సిపిఎం కార్యాల యంలో సదస్సు కర పత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ పట్టణ కార్య దర్శి విశ్వనాథ్, సిపిఎం నాయకులు శేఖర్ పాల్గొన్నారు.

అదుపుతప్పి లారీ బోల్తా

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

అదుపుతప్పి లారీ బోల్తా పడిన సంఘటన బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. లారీలో కూలీలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. పులివెందుల నుండి నల్లపురెడ్డిపల్లె మీదుగా వెళుతున్న అరటికాయల లారీ నల్లగొండవారి పల్లి ఘాటు వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.